ఖాకీల్లో కలవరం..!

- వైసీపీతో అంటకాగిన కొందరు పోలీసులు
- విపక్ష నేతల వేధింపులే లక్ష్యంగా విధులు
- ప్రభుత్వం మారడంతో చర్యల భయం
- జాబితా సిద్ధం..!



పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కొందరు ఖాకీలు పరిధి దాటి వ్యవహరించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైసీపీతో పలువురు పోలీసులు అధికారులు, సిబ్బంది అంటకాగారన్నది నిర్వివాదాంశం. వైసీపీ కార్యకర్తలను మించి పనిచేశారు. ప్రభుత్వ తీరును ప్రశ్నించినా, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల అవినీతిని ఎత్తిచూపినా, మాట్లాడినా.. ప్రతిపక్ష నాయకులపై ప్రతాపం చూపారు. కక్ష సాధింపులకు దిగారు. కేసులు నమోదు చేసి, వేధించారు. న్యాయం చేయాల్సిన ఖాకీలు పరిధి దాటి వైసీపీ నేతలతో అంటకాగారు. ఐదేళ్లూ వారు చెప్పిందే శాసనంగా ముందుకెళ్లారు. ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి, బాధపెట్టారు. మళ్లీ వైసీపీనే గెలుస్తుందని గత ఎన్నికల ముందు టీడీపీ కూటమి నేతలపై అక్రమ కేసులు పెట్టారు. ఎన్నికలకు దూరం చేయాలని చూశారు. వారి అంచనాలు తల్లకిందులయ్యాయి. వైసీపీకి ప్రజలు ఘోరపరాజయం మిగిల్చారు. కూటమికి పట్టంకట్టారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కొలువుదీరిన కొత్త ప్రభుత్వం పాలనపై ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని శాఖల్లో పక్షాళన ప్రారంభించింది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో మొదలెట్టింది. తరువాత జిల్లా, మండలస్థాయి వంతు. వైసీపీ నేతలకు వంతపాడిన అధికారుల చిట్టాను సిద్ధం చేసినట్లు తెలిసింది. జిల్లాలో ఐదేళ్లూ అత్యుత్సాహం ప్రదర్శించి, వైసీపీ అరచాకపర్వానికి సహకరించిన పోలీసులపైనే తొలివేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శాసనసభ ముగిసి జిల్లాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు రావడమే తరువాయి. వైసీపీతో అంటకాగిన అధికారులపై వేటుకు వేళాయె అన్న చర్చ నడుస్తోంది. ఈనేపథ్యంలో వైసీపీతో అంటకాగిన వారిలో దడ మొదలైంది.

వైసీపీ కళ్లలో ఆనందం కోసం..

ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది పాలకులు మారారు. వైసీపీ పాలకులు మాత్రం భిన్నం. అధికారం కోసం వ్యవస్థలన్నింటినీ భ్రష్టపట్టించారన్న విమర్శలు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ఐదేళ్లూ జిల్లాలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పిందే వేదంలా నడిచింది. అన్ని నియోజకవర్గాల్లో కొందరు ఖాకీలు.. వైసీపీతో అంటకాగారు. అది ఏస్థాయిలో అంటే తెలుగుదేశం పార్టీకి చెందిన వారిని పోలీసులు స్టేషన్‌కి తీసుకెళ్లి, వారిని కొట్టి, వీడియోలు తీసి వైసీపీ ప్రజాప్రతినిధులకు పంపి, రాక్షసానందం పంచారు. ఇదే తరహా ఘటన ఏడాది క్రితం ధర్మవరంలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. దీనినిబట్టి చూస్తే గత ఐదేళ్లూ అధికార అరాచకం ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో పోలీసులు అరాచకంగా వ్యవహరించారని అన్నివర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. కదిరి, హిందూపురం, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాల్లో కూడా అధికార పార్టీ దాడులు, అరాచకాలు, వేధింపులు, అక్రమ అరెస్టులు కోకోల్లలు. గతేడాది సెప్టెంబరులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం పెల్లుబికింది. ప్రభుత్వ తీరును ఖండిస్తూ టీడీపీ శ్రేణులు రోడ్డెక్కి, ఆందోళనలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గంలో వందలాది మందిపై అక్రమ కేసులు నమోదు చేశారు. అంతటితో ఆగకుండా నేతలను గృహనిర్బంధాలు చేసి మరీ.. కేసులు పెట్టిన చరిత్ర వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖాకీలను అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాలను కట్టడి చేసి, ఏకపక్షం చేసుకున్నారు. గెలిచిన ప్రతిపక్షాల అభ్యర్థులను సైతం బెదిరించి, వైసీపీ ఖాతాలో వేసుకున్నారు. వైసీపీ నేతలు, పాలకుల మెప్పు కోసం కొందరు ఖాకీలు.. ప్రతిపక్షాల వారిపై అక్రమ కేసులు బనాయించి, అణిచివేచే ప్రయత్నం చేశారు. ఐదేళ్లూ వైసీపీ సేవలోనే గడిపిందన్న విమర్శలు మూటగట్టుకుంది ఖాకీ.

ఫ్రెండ్లీ పోలీసింగ్ తూచ్..

వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలను ప్రశ్నించినా, విమర్శించినా ఖాకీని అడ్డంపెట్టుకుని వేధించారు. అదుపులోకి తీసుకుని, దాడులు, అక్రమలు కేసులు బనాయించడం, ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, బెదిరించడం వంటి అరాచకాలు సాగించారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు ఖాకీ తలొగ్గడమే కాకుండా కొందరి మెప్పుకోసం ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసిన ఘటనలు కోకొల్లలు. ధర్మవరం, పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లోనే అత్యధికంగా ఇటాంటి దౌర్జన్యాలు సాగాయి. ఏడాదిన్నర క్రితం ధర్మవరంలో అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని ఆ ప్రజాప్రతినిధి ఒత్తిడితో పోలీసులు.. టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ తోట వాసుదేవపై కేసు నమోదు చేయడంతోపాటు విచక్షణారహితంగా కొట్టినట్లు వెలుగులోకి వచ్చింది. ధర్మవరంలో ఓ ఆటోడ్రైవర్ తన ఆటోపై పరిటాల శ్రీరామ్ స్టిక్కర్ పెట్టుకుంటే పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి, బెదిరించారు. ప్రభుత్వ తీరు, పెనుకొండ ఎమ్మెల్యే అరాచకాలపై విమర్శలు గుప్పించి, పోరాటం చేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, ప్రస్తుత మంత్రి సవితపై ఐదు కేసులు నమోదు చేశారు. ఆర్థిక మూలాలను సైతం దెబ్బతీశారు. అయినా భయపడకపోవడంతో సవిత దూకుడు తగ్గించేందుకు వైసీపీ కుట్రలు పన్నింది. ఇందులో ఓ ఖాకీ అత్యుత్సాహం చూశారు. కదిరిలో ఓ భూమి వివాదం విషయంలో బాధితుల తరఫున వెళ్లిన టీడీపీ నేతలపై ఓ సీఐ ఏకంగా మీసం మెలేయడంపై అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. పుట్టపర్తి గ్రామీణ, పట్టణ సర్కిళ్ల సీఐలు అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చెప్పిందే వేదంగా పనిచేసినట్లు ఆ శాఖలోనే చర్చ సాగుతోంది. ఇలా జిల్లాలో చాలాచోట్ల ఖాకీలు.. వైసీపీ నేతలతో అంటకాగారు. అధికార పార్టీ నేత మెప్పు కోసం అమయాకులను సైతం పోలీసు స్టేషన్‌కు పిలిపించి, బెదిరించిన ఉదంతాలు అనేకం. చివరకు పోలీస్ బాస్‌లంటే లెక్కలేనంతగా కొందరు కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. జిల్లాలో గత ఐదేళ్లూ సామాన్యులు కూడా పోలీసు స్టేషన్‌కు వెళ్లాలంటే జంకే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూలమి ప్రభుత్వం కొలువుదీరడంతో హద్దులు మీరి అరాచకాలకు పాల్పడిన ఖాకీల్లో కలవరం మొదలైంది. తమకు శిక్ష తప్పదని వారు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. తమ బాధ్యతలను పారదర్శకంగా నిర్వహించి ఉండుంటే ఈ దుస్థితి వచ్చేది కాదు కదా.. అన్న చర్చ సాగుతోంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక సందడి
- తొలిరోజు 106 అర్జీల స్వీకరణ



సందడిగా ఫిర్యాదులు స్వీకరించే హాల్

పుట్టపర్తి, జూన్ 24: స్థానిక కలెక్టరేట్‌లో చాన్నాళ్లకు సందడి కనిపించింది. దాదాపు మూడు నెలల తరువాత ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడంతో జనం తరలివచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలలుగా స్పందన కార్యక్రమాన్ని ఆపేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రారంభించారు. తమ సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తొలిరోజే 106 ఫిర్యాదులను కలెక్టరు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసమస్యకు పరిష్కారం చూపేలా ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాకేంద్రంతోపాటు మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతులు స్వీకరించి, ఆన్‌లైన్ నమోదు చేస్తామన్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని యంత్రాంగానికి ఆయన ఆదేశించారు. జిల్లాలో డయేరియా నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. తరచూ తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలనీ, డ్రైనేజీ ప్రాంతాల్లో లీకేజీలు లేకుండా మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

● అర్హత ఉన్నా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయలేదని తాడిమర్రి మండలం దాడితోటకు చెందిన వెంకటనారాయణ ఫిర్యాదు చేశారు. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ఇంటిపట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, పింఛన్ల కోసం ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, డీపీఓ విజయ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

●జాతీయ రహదారుల కోసం భూమిని కోల్పోయామని పరిహారం ఇంతవరకు రాలేదంటూ గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన రైతులు రామిరెడ్డి, జయచంద్రారెడ్డి నాగభూషణం ఫిర్యాదు చేశారు.

డీపీఓలో 21 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఎస్పీ విష్ణు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 21 అర్జీలు అందినట్లు ఏఎస్పీ విష్ణు తెలిపారు. వాటిని స్వీకరించిన ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాసమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని పోలీసు వర్గాలను ఆయన ఆదేశించారు.

ఎంపీగా బీకే ప్రమాణ స్వీకారం

పుట్టపర్తి, జూన్24 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీగా బీకే పార్థసారథి సోమవారం ప్రమాణం చేశారు. 18వ లోక్‌సభ కొలువుదీరిన వేళ కొత్తగా ఎంపికైన ఎంపీల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా సాగింది. ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో హిందూపురం లోక్‌సభ సభ్యుడిగా బీకే పార్థసారథి తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఎంపీగా ప్రమాణం చేయడం ఇది రెండోసారి. ఈ సందర్భంగా ఆయనకు జిల్లాలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు.



ప్రమాణం చేస్తున్న బీకే పార్థసారథి

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 24: జిల్లాలో సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వీటిని తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు విద్యార్హత పత్రాలను జతపరచి, బుక్కపట్నంలోని ఓల్డ్ డైట్ కాలేజీ భవనంలోగల సమగ్రశిక్షణ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. ఫిజియోథెరపీలో డిగ్రీ, పీజీ చేసినవారు అర్హులన్నారు. వయసు ఈఏడాది మే 31 నాటికి 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. విద్యార్హత వివరాలను సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. deosss.blogspot.com వెబ్‌సైట్‌ను కూడా సందర్శించవచ్చని డీఈఓ వివరించారు.

వైసీపీ ప్యాలెస్‌కు నోటీసు

- ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని అల్టిమేటం
- కార్యాలయ భవనానికి అతికించిన యంత్రాంగం
- గతేడాదే అక్రమమని తేల్చి.. తొలి నోటీసు జారీ

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

జిల్లా కేంద్రంలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయల భవన నిర్మాణంపై పుట్టపర్తి పురపాలిక టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండానే కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారనీ, ఇది అక్రమమంటూ సోమవారం రెండో నోటీసు జారీ చేశారు. ఆ మేరకు వైసీపీ కార్యాలయ భవనానికి నోటీసు అతికించారు. పుట్టపర్తిలోని ఎయిర్‌పోర్టు ఎదురుగా సర్వే నంబర్లు 666-6ఏ1, 7ఏ1లోని రెండెకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణంపై దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో అధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రభుత్వ భూములు కాజేసి, అనుమతుల్లేకుండా జీప్లస్ వన్ భవనాన్ని కట్టేశారు. అక్రమ నిర్మాణంపై దుమారం రేగడంతో పురపాలిక అధికారులు.. వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి నోటీసులు అతికించారు. అనుమతుల్లేకుండా చేపట్టిన భవన నిర్మాణంపై గతేడాది సెప్టెంబరు 21న నోటీసు జారీ చేసినట్లు ప్రస్తుత నోటీసులో పేర్కొన్నారు. ఆ నోటీసుకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు అప్పట్లో సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో రెండో నోటీసు జారీ చేశామనీ వెంటనే భవన నిర్మాణం ఆపాలనీ, లేదంటే కూల్చివేసే అధికారం మున్సిపాలిటీకి ఉందని తేల్చిచెప్పారు. చట్టప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో ఏడు రోజుల్లోగా తెలపాలని తాజా నోటీసులో స్పష్టం చేశారు. వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణంపై గతంలోనే నోటీసు జారీ చేసినట్లు తాజాగా పేర్కొనడం చర్చనీయాంశమైంది. అప్పట్లో వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గి, చర్యలు తీసుకోలేకపోయారన్న విషయం స్పష్టమవుతోంది. ఆ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యాలయాల పేరుతో ప్రతి జిల్లాలోనూ కోట్ల విలువైన భూములను లీజు ముసుగులో స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ ప్యాలెస్‌ల నిర్మాణం చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న భవనం కూడా అక్రమమని అధికారులు తేల్చారు. ఆ మేరకు నోటీసులిచ్చారు. కాగా, ప్రభుత్వ భూమిని లీజు పేరుతో రాసేసుకుని, అక్రమంగా నిర్మాణం చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం వైసీపీ కార్యాలయం వద్ద భవన నిర్మాణ పనులు ఆపేసి, మెటీరియల్‌ను కూలీలు ట్రాక్టర్‌లో తరలించడం కనిపించింది.



వైసీపీ జిల్లా కార్యాలయ భవనం



PUTTAPARTHI MUNICIPALITY
CONFIRMATION ORDER
ORDERS UNDER SECTION 228(3) OF APM ACT 1965
ORDER :
Commissioner
Puttaparthi Municipality
TO
The President, YSR Congress Party,
Sathya Sai District, Puttaparthi

నారా లోకేశ్‌కు సవిత అభినందనలు

పుట్టపర్తి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌కు జిల్లాకు చెందిన మంత్రి సవిత అభినందనలు తెలిపారు. సచివాలయంలోని తన చాంబర్‌లో నారా లోకేశ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు బీసీ, ఆర్థిక వెనుబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అభినందించారు.



నారా లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న మంత్రి సవిత

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



ఆలయంలో ట్రైనీ కలెక్టర్లు

లేపాక్షి, జూన్ 24: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని సోమవారం ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు సందర్శించారు. అర్చకులు నరసింహశర్మ, శ్రీనివాసరావు.. ఆలయ చరిత్రను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభం, నాట్యమండపాన్ని సందర్శించి, సంతోషం వ్యక్తం చేశారు. ఆ నాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్లు కల్యాణి, భావన, బొల్లిపల్లి వినూత్న, దామెర హిమవంశి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, శుభం నోక్‌వాల్‌ను దుశ్శాలువాలతో ఆలయ సిబ్బంది సన్మానించారు.



సచివాలయ భవనంపై జగన్ ఫొటో

అయినా.. వైసీపీ సేవలోనే..

- సచివాలయ భవనంపై తొలగించని జగన్ ఫొటో
- అధికారుల తీరుపై విమర్శలు

బుక్కపట్నం, జూన్ 24: సార్వత్రిక ఎన్నిల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరి పక్షం రోజులు కావస్తున్నా.. అధికారులు ఇంకా మేల్కోలేదన్న విమర్శలున్నాయి. నేటికీ వైసీపీ సేవలోనే తరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుక్కపట్నం సచివాలయం-1 భవనంపై మాజీ ముఖ్యంత్రి జగన్ ఫొటో అలాగే ఉంచడమే అందుకు నిదర్శనం. ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో తొలగించి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటుచేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. మండలకేంద్రంలోని సచివాలయ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 రోజులు కావస్తున్నా, మాజీ ముఖ్యమంత్రి ఫొటో తొలగించకపోవడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ నాయకుడి కబ్జా

- న్యాయం చేయాలని రైతు ఫిర్యాదు

హిందూపురం, జూన్ 24: తన భూమిని హిందూపురానికి ఓ వైసీపీ నాయకుడు కబ్జా చేశాడంటూ పరిగి మండలం ఊటకూరుకు చెందిన రైతు గంగాధరప్ప ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. గంగాధరప్ప సోమవారం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ లక్ష్మీ నరసప్పకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 5.10 ఎకరాల భూమి తన తండ్రి హనుమంతప్ప పేరుపై ఉందని అందులో పేర్కొన్నాడు. కొంతకాలం క్రితం తన తండ్రి మతిచెందాడన్నాడు. వైసీపీ నాయకుడు తమ పొలంపై రుణం ఇప్పిస్తానని చెప్పి మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సంతకాలు చేయించి, గతేడాది జూన్‌లో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళ పేరుతో పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. అనంతరం అతడిని నిలదీయగా.. కొంత మొత్తం ఇచ్చి, తప్పించుకుంటున్నారు తప్ప.. తమకు న్యాయం చేయలేదన్నారు. వైసీపీ నాయకుడు కావడంతో అప్పట్లో అధికారులెవరూ తన గోడు పట్టించుకోలేదని వాపోయాడు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరాడు.



డీటీకి ఫిర్యాదు చేస్తున్న రైతు గంగాధరప్ప

ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్‌బాబు


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయశంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, జూన్ 24: మండల పరిధిలోని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి రాజమండ్రిలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా బదలీ అయ్యారు. విజయశంకర్ బాబు మాట్లాడుతూ జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా శాస్త్రవేత్తల బృందంతో సమష్టిగా పరిశోధనలు ప్రధానంగా వేరుశనగ, అంతర పంటలపై దృషిసారించి, రైతులకు మరిన్ని సేవలందిస్తామన్నారు.

పలువురు శాస్త్రవేత్తలు బదలీ: ఈయనతో పాటు శాస్త్రవేత్తగా పనిచేస్తున్న పీ రాధిక ఏలూరు జిల్లా మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా బదలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తగా రమేష్‌నాయక్ ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడే పనిచేస్తున్న మరో శాస్త్రవేత్త పవన్‌కుమార్ రెడ్డిని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి బదిలీ అయ్యారు.

లక్ష మొక్కలను పెంచుదాం: కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 24: జిల్లాలో ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలు నాటి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పచ్చదనం ఎక్కువగా ఉంటే వర్షాలు బాగా కురుస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. జూలై నెలలోపు లక్ష మొక్కలు నాటేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు. ఇందుకోసం ఒక మొబైల్ యాప్ తయారు చేశామని, నాటిన మొక్కల సంరక్షణను దత్తత ఇస్తామని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత దత్తత ఇచ్చి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించి, ప్రమాణపత్రం వారికి అందజేస్తామని అన్నారు. సోషల్ ఫారెస్టులో 10,08,771 మొక్కలు, రాయదుర్గం ఫారెస్ట్‌లో 50 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కలు నాటడం, పెంచడం కోసం వివిధ శాఖలకు టార్గెట్ ఇచ్చామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు చెట్లునాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడినవారు

కణేకల్లు, జూన్ 24: మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క దాడి చేయడంతో ఇద్దరు చిన్నారులతో పాటు ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం బస్టాండ్ వద్ద ఎర్రిస్వామి అనే వ్యక్తిపై కుక్క దాడి చేసింది. అలాగే దిగువగేరిలోని కొండారెడ్డి స్కూల్‌లో చదివే హేమంత్, యాస్మిన్ అనే విద్యార్థులపై కూడా దాడి చేసి గాయపరిచింది. వీరందరికీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం పిచ్చికుక్కను స్థానికులు చంపేశారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ టౌన్, జూన్ 24: ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో బాలికల ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాసంస్థల డీన్ రాము సోమవారం ఒక ప్రకటన విడుదల చేసినట్టు పీఆర్‌ఓ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ గండిపేటలో ఉన్న హైదరాబాద్ డిగ్రీ అకాడమీలో డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు 30వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా రాయలసీమ ప్రాంత విద్యార్థులకు అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్ రిలయన్స్ టవర్‌లో ఉన్న అనంత భవిత ఐఏఎస్ అకాడమీలో రాత పరీక్ష ఉంటుందన్నారు. నిర్దేశించిన మార్కులు వచ్చిన పది మంది విద్యార్థులకు నెలకు రూ.5వేలు, మరో 15 మందికి రూ.3వేలు చొప్పున మూడేళ్ల ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 7660002627, 9908551643 నంబర్లకు సంప్రదించాలన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

యల్లనూరు, జూన్ 24: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో టీడీపీ కార్యకర్త గంగాధర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శంకర్‌తోపాటు మరికొంతమంది దాడిచేశారు. రెండురోజుల నుంచి వైసీపీకి చెందిన కొంత మంది సోషల్ మీడియాలో టీడీపీ వారిపై రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంపై యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో టీడీపీ కార్యకర్త గంగాధర్‌పై శంకర్‌తోపాటు మరికొంతమంది దాడికి ప్రయత్నించారు. ఈ దాడిలో గంగాధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స కోసం తిమ్మంపల్లికి వెళ్లగా అక్కడ కూడా మరోసారి దాడికి ప్రయత్నించాడని గంగాధర్ తెలిపారు. యల్లనూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దాడికి యత్నించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురం రూరల్, జూన్ 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,010 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆరోగ్య మత్తు..!



- జగన్ పాలనలో నాసిరకం మద్యం విక్రయాలు
- ధర పెంచి మందుబాబుల జేబులకు చిల్లులు
- నాసిరకం మద్యంతో ఒళ్లు గుల్ల
- నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూపులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో కొత్త ఉత్సాహం



"అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కీలక అంశాల్లో ఒకటి.. నాసిరకం మద్యం. మునుపెన్నడూ లేని బ్రాండ్లను ప్రవేశపెట్టి.. భారీగా మద్యం ధరలను పెంచిన వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. జె-బ్రాండ్ మద్యం కారణంగా తమ ఆరోగ్యం దెబ్బ తింటోందని మద్యం ప్రియులు వాపోయారు. పెరిగిన మద్యం ధరల కారణంగా మద్యం సేవించి అలవాటు ఉన్న పేదలు ఆర్థికంగా నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వ తీరును విమర్శిస్తూ.. టీడీపీ అధినేత చంద్రబాబు మద్యం విషయంలో సంస్కరణలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ధరలను తగ్గించడం, మునుపటి బ్రాండ్లను అందుబాటులోకి తేవడం, నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయడం వంటి హామీలు ఇప్పుడు అమలులోకి రావాల్సి ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మద్యం ప్రియులు పండుగ చేసుకున్నారు. మద్యం మితంగా తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ వ్యసనంగా మారితే ఆరోగ్యం చెడిపోతుంది. ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటారు. మద్యం సేవించే అలవాటు ఉన్నవారు జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది."

అనంతపురం అర్బన్, జూన్ 24: నాణ్యమైన మద్యం కోసం మందు బాబులు ఎదురు చూస్తున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యాన్ని తమపై రుద్దాడని, గతిలేక దాన్నే తాగి ఒళ్లు గుల్ల చేసుకున్నామని పలువురు మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బూంబూం, బ్లాక్ బస్టర్, ప్రెసిడెంట్ మెడల్, స్పెషల్ స్టేటస్, హార్సెస్, ఓషన్ బ్లూ, గోల్డెన్ కింగ్, దారుహౌస్, ఆంధ్రాగోల్డ్, సుప్రీం ఇలా పలు రకాల పేర్లతో నాసిరకం మద్యాన్ని తమకు అంటగట్టారని వారు మండిపడుతున్నారు. ఈ నాసిరకం మద్యాన్ని కూడా రెండింతల ధరకు విక్రయించి జేబుకు చిల్లుపెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే గతంలోని కొన్ని బ్రాండ్స్‌ను పక్కన పెట్టి, జే బ్రాండ్స్‌ను మార్కెట్‌లో తెచ్చారు. ఇందులో ఎక్కువ మోతాదులో స్పిరిట్ ఉండటంతో దాన్ని తాగిన ఎక్కువ శాతం మంది అనారోగ్యం పాలయ్యారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వినియోగించే చీప్ లిక్కర్‌తో పాటు రెగ్యులర్, మీడియం బ్రాండ్లను కల్తీచేయడంతో అనారోగ్యం పాలయ్యామని మద్యం ప్రియులు వాపోతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం పరిపాలన ప్రారంభం అయ్యింది. గతంలో హామీ ఇచ్చిన మేరకు ప్రస్తుత పాలకులు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తారని మందుబాబులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో షాపుల నిర్వహణ

వైసీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 186 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. ప్రతి ఏడాది రూ.110 కోట్లకుపైగా విలువైన మద్యం, బీర్ల విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం తయారీ కంపెనీలను వైసీపీ నేతలు ఆక్రమించుకొని నాసిరకం మద్యాన్ని తయారు చేసి ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరిపారు. కేవలం నగదు తీసుకొని మద్యాన్ని విక్రయించారు. దీనిపై అప్పటి ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. దీంతో రెండేళ్ల తర్వాత మద్యం షాపులకు డిజిటల్ యంత్రాలు సరఫరా చేశారు. కానీ పాత పద్ధతిలోనే డబ్బులు చెల్లిస్తేనే మద్యాన్ని విక్రయించారు. తద్వారా భారీగా దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.


అనంతపురంలోని ప్రభుత్వ మద్యం దుకాణం

మారనున్న మద్యం పాలసీ

గత టీడీపీ హయాంలో మద్యం పాలసీ నిబంధనల మేరకు అమలు చేసేవారు. లైసెన్స్ విధానంలో టెండర్లు, లాటరీ విధానం ద్వారా ప్రైవేటు షాపులకు అనుమతులు ఇచ్చారు. అప్పట్లో మద్యం ఎంఆర్‌పీపై వ్యాపారులకు 15 శాతం దాకా ప్రభుత్వమే చెల్లించేది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ విధానాన్ని రద్దు చేసి, మద్యాన్ని ఎంతకైనా విక్రయించుకోవచ్చని చీకటి జీవోను జారీ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నిర్వహించి మద్యం మాఫియాకు తెరలేపారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో పాత మద్యం పాలసీని తిరిగి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. లాటరీ లేదా టెండర్ల ద్వారా మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించనున్నట్లు సమాచారం. ఆ నోటిఫికేషన్ కోసమే మందుబాబులందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం డిపోలో స్టాక్ ఉన్న జే బ్రాండ్లు మాత్రమే మద్యం షాపులకు పంపుతున్నారు. కంపెనీల నుంచి సరఫరాను ఆపేసినట్లు తెలిసింది. టెండర్లు లేదా లాటరీ విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు షాపులు కేటాయించినప్పటి నుంచి నాణ్యమైన మద్యం సరఫరా కానుంది. అంతర్జాతీయ కంపెనీలు తయారు చేసే మద్యం బ్రాండ్లు మళ్లీ దర్శనమివ్వనున్నాయి. జే బ్రాండ్స్ పూర్తిగా బంద్ కావడంతోపాటు గత టీడీపీ హయాంలో సరఫరా చేసిన విధంగానే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తారని సమాచారం. ఆ క్షణం కోసమే మద్యం ప్రియులు ఎదురుచూస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



వైసీపీ హయాంలో నాసిరకం మద్యాన్ని అంటగట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారు. గతంలో పోలిస్తే రెండింతలు అధిక ధరలు పెంచేసి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడేలా చేశారు. నాసిరకం మద్యం తాగలేక మద్యం ప్రియులు నానా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఎప్పుడెప్పుడు పోతుందా.. నాసిరకం మద్యం బెడద ఎప్పటి నుంచి తప్పుతుందా అని అందరూ ఎదురుచూశారు. అనుకున్నట్టుగానే టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ నాణ్యమైన మద్యం సరఫరా చేయడం ఖాయమని అందరూ ఆశతో ఎదురుచూస్తున్నారు.

- వెంకటసతీష్, అనంతపురం

జగన్‌ను తిట్టనివాడే లేడు



మద్యం షాపుల వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు చేసిన వారిలో జగన్‌ను తిట్టని వారే లేరు. ధరలు పెంచడంతోపాటు నాసిరకం మద్యం అంటగట్టడంతో జగన్ ఎప్పుడు దిగిపోతాడా అని మద్యం ప్రియులందరూ ఎదురుచూశారు. నాసిరకం మద్యం తాగిన వారు ఎవరూ వైసీపీకి ఓటు వేయలేదు. కూలి పనులు చేసుకొని ఒళ్లునొప్పులు తగ్గేందుకు నాలుగు పెగ్గులు తాగే మద్యం ప్రియులు ఆ రోజు వచ్చిన కూలి డబ్బులన్నీ మద్యానికి ఖర్చు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మద్యానికి అలవాటుపడిన అనేక మంది ధరలు పెంచడంతో అప్పులపాలయ్యారు. టీడీపీ అధికారంలో రావడంతో తమకు నాసిరకం జే బ్రాండ్స్ బెడద నుంచి విముక్తి కలగతుందని అందరూ సంతోషపడుతున్నారు.

- చంద్రమోహన్, అనంతపురం

తెగిన చెక్‌డ్యాంలు..!

- వృథాగా పోతున్న వర్షపు నీరు
- రూ.లక్షల నిధులు నీటిపాలు


పి. సిద్ధరాంపురం సమీపాన తెగిపోయిన చెక్‌డ్యాం

ఆత్మకూరు జూన్ 24: మండలంలో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెక్‌డ్యాంలు వర్షాలకు తెగిపోతున్నాయి. ప్రభుత్వం గ్రామాల్లో వాటర్‌షెడ్‌ల ద్వారా చెక్‌డ్యాంలు నిర్మిస్తే వాటిని కొందరు రైతులు నీటినిల్వతో పంటలు దెబ్బతింటున్నాయని ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలలో చేరిన నీరు నిల్వ ఉండటం లేదు. చెక్‌డ్యాంల ద్వారా నిల్వ ఉన్న నీటితో భూగర్భజలాలు పెంపొందుతాయి. గత టీడీపీ పాలనలోనే అత్యధికంగా చెక్‌డ్యాంలు నిర్మించారు. దీంతో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. పి సిద్ధరాంపురం గ్రామ సమీపాన రూ.5 లక్షలుతో నిర్మించిన చెక్‌డ్యాం తెగిపోయింది. దీంతో వర్షం నీరు వృథాగా పోతోంది. మండలంలో మరిన్ని చెక్‌డ్యాంల పరిస్థితి ఇదే. వాటిని పట్టించుకొనేవారు కరువయ్యారు. మండల అధికారులు ఆత్మకూరు వద్దనున్న చెక్‌డ్యాంనకు తాత్కాలికంగా రూ.10 లక్షలతో మరమ్మతు చేయించారు. అయితే కొందరు దానిని ధ్వంసం చేశారు. మూడేళ్లయినా చెక్‌డ్యాం మరమ్మతు చేయలేదు. పి.యాలేరు, మదిగుబ్బ, సనప, ముట్టాల, గొరిదిండ్ల, ఆత్మకూరు, పి.సిద్ధరాంపురం గ్రామాల్లో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెక్‌డ్యాంలు తెగిపోయాయి. రైతులు పలుసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకకుండా పోయింది.

ఆత్మకూరు చెరువుకు మోక్షమెప్పుడో?

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చెరువు 15 ఎళ్ల క్రితం కురిసిన వర్షాలకు తెగిపోయింది. అప్పటి నుంచి రైతులు, ప్రజలు వర్షపు నీటితో అష్టకష్టాలు పడుతున్నారు. చినుకు వర్షం పడితే కునుకు లేకుండా పోతోందని చెరువు ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో గత ఎమ్మెల్యే చెరువుకట్టకు మరమ్మతు చేయించి, చెరువులో నీటిని నిల్వ చేస్తానని ఐదేళ్లు మాయమాటలతో కాలం గడిచిపోయిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేసి చెరువును పట్టించుకోకుండా వదిలేశారు. భారీ వర్షాలు కురిస్తే రాత్రివేళల్లో ఎప్పుడు ఇళ్లలోకి నీరు వస్తాయోనని ఎస్సీ కాలనీ వాసులు బిక్కుబిక్కు మంటూ గడపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువుపై దృష్టి సారించలేదని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా టీడీపీ ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకుని తెగిపోయిన చెక్‌డ్యాంలు, చెరువును మరమ్మతు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


ఆత్మకూరులో తెగిపోయిన చెరువు

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, జూన్ 24: ఉమ్మడి జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ సెక్యూరిటీ సంస్థలో అనంతపురంలో పనిచేయుటకు పదో తరగతి నుంచి డిగ్రీ అర్హతతో సూపర్‌వైజర్, గార్డ్ పోస్టులకు 26వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా కియ అనుబంధ సంస్థ సియాన్ ఆటోమేటివ్ సంస్థ పెనుకొండలో పనిచేసేందుకు బీటెక్, డిప్లొమా, ఏదేని డిగ్రీ అర్హతతో గ్రాడ్యుయేట్, డిప్లొమా ఇంజనీర్ ఉద్యోగాలకు 28వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి నిర్వహించే ఉద్యోగ మేళాకు ఆసక్తిగల యువతీ, యువకులు వారి బయోడేటాతో హాజరు కావాలని కోరారు.

35,800 భూసార పరీక్షల నిర్వహణ

అనంతపురం అర్బన్, జూన్ 24: ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 35,800 భూసార పరీక్షలు నిర్వహించినట్లు అనంతపురం భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత సోమవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 18,600, సత్యసాయి జిల్లాలో 17,200 పరీక్షలు నిర్వహించారన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారులు రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

73,993 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 24: జిల్లాలోని ఆర్బీకేల్లో సోమవారం 25వ రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి వరకు 82,125 మంది రైతులకు 73,993 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 84,632 మంది రైతులు 74,725 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

నేటిలోగా గురుకులాల్లో చేరండి

- ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్24: ఉమ్మడి అనంత జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీటు పొందిన విద్యార్థులు మంగళవారంలోగా వారి వారి గురుకులాల్లో చేరాలని... లేదంటే తరువాతి మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు సీటును కేటాయించనున్నట్లు అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. సీటు పొందిన విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్కు మొదటి పేజీ, ఫొటోలు, ర్యాంక్ కార్డు, అలాట్‌మెంట్ కాపీలతో సీట్లు కేటాయించిన గురుకులాల్లో చేరాలన్నారు. లేని పక్షంలో ఈ సీట్లను వేరొక విద్యార్థులకు కేటాయిస్తామన్నారు.

ఉపాధి కూలీలపై చిన్నచూపు..!

- వైసీపీ పాలనలో కనీస సౌకర్యాలు మృగ్యం
- గడ్డపార కూడా ఇవ్వని దుస్థితి
- నామమాత్రంగా మెడికల్ కిట్లు, టార్పాలిన్ల పంపిణీ
- వేసవి అలవెన్స్‌కు మంగళం
- కూలీలపై అదనపు భారం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఓబుళదేవరచెరువు, జూన్ 24: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి కూలీలకు వసతులు కరువయ్యాయి. కూలీలే గత్యంతరం లేక కాయకష్టం చేసిన డబ్బుతో గడ్డపారలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి, పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉపాధి పథకం నిబంధనల మేరకు కూలీలు చేసిన పనులతోపాటు 40 కూలీల సామగ్రికి ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చిందే తప్ప.. ఉపాధి కూలీల వసతులపై దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమడగూరు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు మండలాల్లో 26,085 జాబ్‌కార్డులుండగా, 48,082 మంది కూలీలు పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 21,991 జాబ్‌కార్డులకు గాను 39,170 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు ఉపాధి అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లుగా గడ్డపారలేవీ?

వైసీపీ పాలనలో ఉపాధి కూలీలకు కనీసం గడ్డపార ఇచ్చిన పాపానపోలేదు. 2014-19 టీడీపీ పాలనలో గడ్డపారలు, మెడికల్ కిట్లు ఇతర వసతులు కల్పించారు. వైసీపీ పాలనలో వాటి ఊసే మరిచారు. కూలీలు సొంతంగా గడ్డపారలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయాల్సి వచ్చింది. మెడికల్ కిట్లు, టార్పాలిన్లు తూతూమంత్రంగా అందించి, మమ అనిపించారు. తరువాత వాటి జాడ కనిపించలేదు. ప్రథమచికిత్స కిట్లు లేకపోవడంతో పని ప్రదేశంలో కూలీలు ప్రమాదాల బారిన పడితే ప్రథమ చికిత్స లేకపోవడంతో పొరు గ్రామాలకెళ్లి ప్రయివేటు వైద్యుల వద్ద ప్రథమ చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వేసవిలో నీడకోసం టార్పాలిన్లు లేకపోవడంతో మండు టెండలోనే ఉపాధి పనులు చేసి, పలువురు వడదెబ్బ బారినపడ్డారు.

అదనపు భారం తగ్గేనా?

ఉపాధి పథకం ప్రారంభం నుంచి కూలీలు గడ్డపారలు పదును పట్టడానికి, తాగునీటి సౌకర్యంతోపాటు పంచాయతీ పరిధిలో ఐదు కిలోమీటర్లు దూరం వెళ్లి పనులు చేసిన కూలీలకు ప్రయాణ చార్జీలు చెల్లించేవారు. 2021 నుంచి ప్రభుత్వం వాటిని చెల్లించకపోవడంతో కూలీలపై అదనపు భారం పడుతోంది. వేసవిలో అదనంగా మార్చిలో కూలీలకు 30 శాతం, ఏప్రిల్‌లో 40 శాతం చెల్లించేవారు. దానిని కూడా రద్దు చేయడంతో కూలీలు నష్టపోయారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

వైసీపీ పాలనలో కూలీలు వసతుల్లేక నానా ఇబ్బందులు పడ్డారు. కష్టపడిన సొమ్ములోనే వసతి సౌకర్యాలు కల్పించుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూలీలకు వసతి సౌకర్యం కల్పిస్తారని, వేసవి కాలంలో చెల్లించే అదనపు కూలి ఇస్తారని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నట్లు కూలీలంటున్నారు. ఉపాధి కూలీల వసతులపై కూటమి ప్రభుత్వం దృష్టించి, ఆదుకోవాలని అవసరంఎంతైనా ఉంది.

ఐదేళ్లుగా వసతులు కరువు



గడిచిన ఐదేళ్లలో కూలీ పనులకు వసతులు లేక నానా ఇబ్బందులు పడ్డం. చేసిన కష్టంతోనే వస్తువులు కొనుగోలు చేశారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించిన వసతులు కల్పించలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కూలీల కష్టాలు గుర్తిస్తారన్న నమ్మకముంది.

- చిన్నబాబు, వీరఓబునపల్లి

వేసవి భత్యం ఇవ్వాలి:



గతంలో వేసవిలో చెల్లిస్తున్న వేసవి భత్యాన్ని తిరిగి కొనసాగించాలి. కొతర లేకుండా గడ్డపారలు, మెడికల్ కిట్లు, టార్పాలిన్లు అందించాలి. గత ప్రభుత్వం ఉపాధి కూలీలను విస్మరించింది. కూటమి ప్రభుత్వ ఉపాధి కూలీల కష్టాన్ని గుర్తించి, వసతి సౌకర్యాలు కల్పించాలి.

- రమణ, ఎం. కొత్తపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గడ్డపారల పంపిణీపై అప్పట్లోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఐదేళ్లపాటు గడ్డపారలు రాలేదు. వచ్చిన మెడికల్ కిట్లు, టార్పాలిన్లు పంపిణీ చేశాం. కూలీలకు వసతుల కల్పన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, డ్వామా

గ్రంథాలయంలో చోరీ

కొత్తచెరువు, జూన్ 24: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వాచ్‌మెన్ మునీర్ తెలిపిన మేరకు వివాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి యథావిధిగా గ్రంథాలయానికి తాళం వేసుకుని నిద్రిస్తున్నానని, రెండు గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు వచ్చి తాళాన్ని పగలకొట్టి లోపలికి చొరబడి తనపై దాడి చేశారన్నారు. అనంతరం 24 ఇనుప కుర్చీలు, 10 ఫైబర్ కుర్చీలు, 4 సీలింగ్ ఫ్యాన్లు, మూడు ఐరన్ బాక్స్‌లు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఉదయం గ్రంథాలయాధికారి జయరాం అక్కడి వచ్చి చూడగా.. గ్రంథాలయ తాళాలు తీసి ఉండటం.. వాచ్‌మెన్ గాయాలతో కిందపడిపోయి ఉండడం కనిపించింది. వెంటనే ఆయన వాచ్‌మెన్‌ను చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

అక్కదేవతల ఆలయానికి నగదు

ఓబుళదేవరచెరువు, జూన్ 24: మండలంలోని దాదారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వెలసిన అక్కదేవతల ఆలయానికి గోరంట్లకు చెందిన ఉమాదేవి, శివయ్య దంపతులు సోమవారం రూ.10 వేలు అందజేశారు. ఆ నగదును పూజారి వెంకటేష్‌కు అందించారు. అనంతరం దాతలు మాట్లాడుతూ ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి తమవంతుగా ఈ సాయం చేశామని తెలిపారు. తొలుత అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు పొందారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ

ధర్మవరం, జూన్ 24: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ ఉంటోందని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు ముతుకూరు బీబీ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శికత్తుల సునీత పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారం చేపట్టిన వెం టనే ఈపురపాలెంలో అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించిన నిందితులను కేవలం 36 గంటల్లోనే పట్టుకునేలా హోంమంత్రి వంగలపూడి అనిత చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థిక సాయం కూడా అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరిగినా అప్పటి పాలకులు స్పందించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల పట్ల ప్రత్యేక బాధ్యతగా ఉంటున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలపై దారుణాలు జరగకుండా అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు స్వర్ణకుమారి, ప్యారీమా, సునంద తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

ఓబుళదేవరచెరువు, జూన్ 24: మండలకేంద్రంలోని తహసీల్దార్ క్యాలయంలో సోమవారం సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూలై ప్రారంభంలో బియ్యం స్టోర్లకు చేరుతాయని, అక్కడనుంచి వాహనాల ద్వారా ప్రజలకు ఇంటింటా సరఫరా చేయాల్సి ఉంటుందని అన్నారు. పంపిణీలో జాప్యం చేయకూడదని సూచించారు. జూలై 15 తరువాత కొత్త డీలర్లు వచ్చే అవకాశముందని పరోక్షంగా పేర్కొన్నారు. వాహనాలు ఇళ్లవద్దకు వచ్చినపుడు కార్డుదారులు బియ్యం తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


పోతులయ్య (ఫైల్)

ధర్మవరం, జూన్ 24: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన పోతులయ్య (28) ధర్మవరం పట్టణం నుంచి బైక్‌లో సొంతూరికి బయల్దేరాడు. మార్కెట్‌యార్డు వద్ద వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పోతులయ్యకు తీవ్రగాయాలైన సంఘటన తెలిసిందే. చికిత్సకోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం బెంగళూరు తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. పోతులయ్య ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

ధర్మవరం, జూన్ 24: పట్టణంలోని 33వ వార్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మున్సిపాలిటీ సిబ్బందిని పిలిపించారు. వారు గుర్తుతెలియని వ్యక్తి అంత్యక్రియలు చేశారు. అంత్యక్రియల ఖర్చులకు ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గోసల శ్రీరాములు ఆర్థిక సాయం అందజేశారు.

వదిన.. మరిది ఆత్మహత్య

● చాగల్లు రిజర్వాయర్‌లో మృతదేహాలు

తాడిపత్రి టౌన్, జూన్ 24: వివాహేతర సంబంధం కారణంగా వరుసకు వదిన, మరిది అయ్యే ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌లో వారి మృతదేహాలు సోమవారం బయటపడ్డాయి. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఓ యువకుడు(26) కా ర్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వరుసకు వదిన(35) అయ్యే మహిళ గుత్తి మండలంలోని ఓ గ్రా మంలో ఉంటోంది. ఆమె భర్త ఆటో డ్రైవర్. దగ్గరి బంధువులు కావడంతో ఒకరి ఇంటికి మరొకరు తరచూ వచ్చివెళ్లేవారు. ఈ క్రమంలో వదిన, మరిది దగ్గరయ్యారు. ఈ విషయం రెండు కుటుంబాలవారికి తెలియడంతో మందలించారు. దీంతో కొన్నాళ్లు దూరంగా ఉన్నారు. నాలుగు రోజుల క్రితం ఆమె తాడిపత్రికి వచ్చింది. మరిదితో కలిసి ఎటో వెళ్లిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందోగాని.. పెద్దపప్పూరు మండలంలోని చాగ ల్లు రిజర్వాయర్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆపి ఇద్దరూ రిజర్వాయర్‌లోకి దూకారు. రిజర్వాయర్ వద్ద ఎవరో బైక్‌ను వదిలి వెళ్లారని పెద్దపప్పూరు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులకు.. ఇద్దరు కనిపించడం లేదని తెలిసి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రిజర్వాయర్‌లో సోమవారం మధ్యాహ్నం మహిళ మృతదేహం, సాయంత్రం ఆమె మరిది మృతదేహం తేలాయి. ఫొటోల ఆధారంగా పెద్దపప్పూరు పోలీసులు మృతదేహాలను గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఆ మహిళకు కుమారుడు, కూ తురు ఉన్నారు. యువకుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం: ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 24: రైతుల అభ్యున్నతే ధ్యేయమని, అందుకోసం చిత్తశుద్ధితో పని చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కుటాగుళ్లలోని పట్టు పరిశ్రమ కేంద్రంలో సోమవారం ఆయన సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ కోసం పంట వేయకపోయినా, వేసినట్లు అధికార పార్టీ నాయకులు, ఇతరులు అధికారులపై ఒత్తిడి తేకూడదన్నారు. నిజంగా పంట వేసి ఉంటేనే పోరాడాలన్నారు. అధికారులు కూడా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. పొలాల కెళ్లి పంటలను పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పర్వీనాబాను, అల్లాముస్తఫా, కొండయ్య, కిష్టప్ప, ఇర్షాన్, ఫయాజ్, గంగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవ ప్రసాద్, ఏఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతుకు విత్తనకాయలు అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

రైతులకు పాసుపుస్తకాలు ఇవ్వాలి

● రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

● ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ధర్మవరం, జూన్ 24: ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న రైతులకు పట్టాలు, పాసుపుస్తకాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జేవీరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేవీ రమణ మాట్లాడుతూ.. ధర్మవరం డివిజన్ పరిధిలోని రైతులు ప్రభుత్వ భూములను చదును చేసుకుని కొన్నేళ్లుగా పంటలు సాగుచేసుకుంటూ ఉపాధి పొందుతున్నారన్నారు. గతంలో అధికారులు సైతం సర్వే చేశారన్నారు. కొన్నిప్రాంతాల్లో అసైన్డ్‌కమిటీ కూడా గుర్తించి జాబితాలో పేర్లను ప్రకటించిందన్నారు. కానీ ఇంతవరకు ఆ భూములకు సంబంధించి రైతులకు పట్టాలు కానీ, పాసుపుస్తకాలు కానీ ప్రభుత్వం మంజూరు చేయలేదన్నారు. కొత్తప్రభుత్వమైనా రైతులకు ఆ భూములకు హక్కులు కల్పించి వారికి బ్యాంకుల ద్వారా రుణాలను పొందే సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్ పొందే అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతంకాటమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పోలేపల్లి ముత్యాలప్ప, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయకార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు బండల వెంకటేశ్, నాగభూషణం, ధనుంజయ, సూర్యనారాయణ, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరెడ్డికి ఘన నివాళి



వెంకటరెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి

ముదిగుబ్బ/కదిరి/ నల్లమాడ, జూన్24: అప్పటి నల్లమాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సద్దపల్లి వెంకటరెడ్డి స్వగ్రామమైన మండలంలోని మలకవేముల గ్రామంలో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని సోమవారం కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరా రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ.. వెంకటరెడ్డి మరణం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటన్నారు. అప్పటి నల్లమాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పేద ప్రజల అభ్యున్నతికి ఎంతో పాటుపడారని కొనియాడారు. పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిశోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, నాగిరెడ్డి, మహబూబ్‌పీరా, ఆనంద్, తుమ్మల సూరి, నారాయణ స్వామి, రామ్మోహన్ రెడ్డి, రాజారెడ్డి, మహేంద్రరెడ్డి, చందనబాబు, సోమురెడ్డి, గంగిరెడ్డి, షైలే శివశంకర్, బుట్టి నాగబూషణనాయుడుతో పాటు ఇతర పార్టీల నాయకులు కూడా నివాళులర్పించారు.

బాబోయ్.. మళ్లీ వచ్చాయ్..

● ఇటీవల కుక్కలను పట్టించి తరలించిన పంచాయతీ అధికారులు

● దగ్గరలోనే వదలడంతో తిరిగొచ్చిన శునకాలు

● సమస్య మళ్లీ మొదటికొచ్చిందని వాపోతున్న స్థానికులు


గాండ్లపెంటలో రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

గాండ్లపెంట, జూన్ 24: మండలకేంద్రంలో ఇటీవల వీధికుక్కలను ఇలా పట్టి.. అలా వదిలేశారని, అందుకే అవి మళ్లీ తిరిగొచ్చాయని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ వీధికుక్కల బెడద అధికంగా ఉండడంతో ప్రజలు ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటే భయాందోళనకు గురయ్యేవారు. ఈ సమస్యపై స్థానికులు పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించారు. కుక్కల భారినుంచి కాపాడాలని కోరారు. దీంతో పంచాయతీ వారు ఇటీవల కుక్కలను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టి వ్యాన్‌కు ఎక్కించారు. కుక్కలను సుదూర ప్రాంతంలో వదులుతామని చెప్పి తీసుకెళ్లారు. అయితే వారు దగ్గరలోనే వదలండంతో అవి తిరిగి మళ్లీ గాండ్లపెంటకు చేరుకున్నాయి. దీంతో మళ్లీ గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్నాయి. దీంతో సమస్య మొదటికి వచ్చిందని, కుక్కల బెడద వదిలిందని ఆనందించే లోపే మళ్లీ గుంపులుగా వచ్చాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వాటి బెడదనుంచి ప్రజలను కాపాడాలని వారు కోరుతున్నారు.

అడిగేవారెవరని..!

- కొర్రపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరాచకాలు
- సిబ్బందితో వెట్టిచాకిరీ... పిల్లలపై వేధింపులు
- నిత్యావసర సరుకులు పక్కదారి
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్


సిబ్బందితో మసాజ్ చేయించుకుంటున్న ప్రిన్సిపాల్

బుక్కరాయసముద్రం, జూన్ 24: ప్రభుత్వం మారినా మండలంలోని కొర్రపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తీరు మారలేదు. గతంలో వైసీపీ నాయకుల అండతో ఆమె అరాచకాలకు హద్దే లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులనే ఆమె గడగడలాడించింది. ఆమె పనిచేస్తున్న గురుకుల పాఠశాలలో తనిఖీకి ఉన్నతస్థాయి అధికారులు రావాలంటేనే జంకేవారు. విద్యార్థులకు సంబంధించిన నిత్యావసర వస్తువులను బహిర్గతంగా ఇంటికి తరలించేది. గతంలో విద్యార్థులకు వచ్చిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా జిల్లా డీసీఓ బాలాజీ నాయక్ పట్టుకుని ఆమెను సస్పెండ్ చేశారు. అనంతరం ఆమె అధికార పార్టీ నేతల సహకారంతో తిరిగి గురుకుల పాఠశాలకు వచ్చింది. అవినీతి ఆరోపణలున్నా... ఆమెపై విచారణ చేయడానికి సంబంధించిన జిల్లా కో-ఆర్డినేటర్ ముందుకు వచ్చేవారు కాదు. విద్యార్థులకూ సరైన భోజనం పెట్టేవారు కాదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలను వేధించేది. సిబ్బందితో వ్యక్తిగత పనులన్నీ చేయించుకునేది. వారితో ఇంటి వద్ద పనులు కూడా చేయించేది. సిబ్బందితో ఆమె ప్రతి రోజూ మసాజ్ చేయించుకోవడం.. జడ వేయించుకోవడం.. తదితర పనులన్నీ చేయించుకునేది. ఎవరికి ఫిర్యాలు చేసినా స్పందన లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తప్పనిపరిస్థితుల్లో ఆమె చెప్పినట్లు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వారినా ఆమె తీరు మారలేదు. దీంతో బాధితులు ఆమె అరాచకాలను చిత్రీకరిస్తూ తీసిన ఫొటోలు, వీడియోలను ఇటీవల సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమె అరాచకాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతికి పాల్పడలేదు : ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గురుకుల బాలికల పాఠశాలలో నేను ఎలాంటి అవినీతి పాల్పడలేదు. కొంత మంది గిట్టని వ్యక్తులు నాపై ఇలా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ, విద్యార్థుల కమిటీ సభ్యులుంటారు. ప్రతి ఒక్కటి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. అవినీతికి పాల్పడే అవకాశమే లేదు. సిబ్బందితో వెట్టిచాకిరీ, మసాజ్ చేయించుకోలేదు. సెలవుల సమయంలో ఇంటి వద్దకు సిబ్బంది వస్తే... ఆ సమయంలో ఏదో తల మీద పడితే.. సిబ్బంది చూశారే తప్ప.. ఎలాంటి పనులూ నేను చేయించుకోలేదు.

రోడ్డుపై మురుగునీటి నిల్వ

● దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

ముదిగుబ్బ, జూన్ 24: మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న వీధిలో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. మురుగునీరంతా రోడ్డుపైకి చేరి నిల్వ ఉంది. దీంతో దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షపు నీరు కూడా తోడవడంతో రోడ్డుపై నీరు పెద్దఎత్తున నిలిచి ఉన్నాయని, దీంతో అటువైపు కాలినడకన కూడా వెళ్లలేకున్నామని అంటున్నారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకెళ్లలేక రోడ్లపైకి వచ్చి నిల్వ ఉంటోందని చెబుతున్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేస్తే ఈ సమస్య ఉండేది కాదంటున్నారు. మురుగునీటి వల్ల దోమలు బెడద అధికంగా ఉందని, వాటి వల్ల రోగాల భారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు ఎక్కడా బ్లీచింగ్ పౌడర్ చల్లడం కానీ.. ఫాగింగ్ చేయడం కానే చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


యూనియన్ బ్యాంక్ పక్క వీధిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఆరు వినతులు


వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం, జూన్ 24: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఆరు వినతులు వచ్చినట్టు ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొదటి సారి ఈ కార్యక్రమం నిర్వహించామన్నా రు. ఇందులో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు వినతి పత్రాలు ఇచ్చారన్నారు. ఇందులో భూమి సర్వేకు రేగాటిపల్లి, చిగిచెర్ల గ్రామాల నుంచి 3, బత్తలపల్లిలో శ్మశాన వాటికకోసం 1, భూ తగాదా పరిష్కారం కోసం 1 , పాసుపుస్తకాల కోసం 1 చొప్పున వినతులు వచ్చాయన్నారు. వీటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.

దోబీఘాట్ ఏర్పాటుకు కృషి: పరిటాల శ్రీరామ్


పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న రజకసంఘం నాయకులు

ధర్మవరం, జూన్ 24: పట్టణంలో రజకుల కోసం దోబీఘాట్, కల్యాణమండపం ఏర్పాటుకు కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. టీడీపీ రజక సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు రజకులు సోమవారం వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరంలో దోబీఘాట్, కల్యాణ మండపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు పరిటాల శ్రీరామ్ స్పందిస్తూ.. వాటి ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మస్తానప్ప, మాల్యవంతం వెంకటేశ్, రాజు, రామాంజి, టైలర్ నరసింహులు, రాధాకృష్ణ, తాడిమర్రి వేణు, రమేశ్ తదితరులు ఉన్నారు.

రైతులకు కందుల పంపిణీ


మీర్జాపురం ఆర్‌బీకేలో కందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జూన్ 24: మండల వ్యాప్తంగా సోమవారం సుమారు 600 మంది రైతులకు 12 క్వింటాళ్ల విత్తన కందులను పంపిణీ చేశామని వ్యవసాయాధికారి నటరాజ్ తెలిపారు. మండలానికి 21 క్వింటాళ్ల కందులు సరఫరా అయ్యాయన్నారు. మొత్తం 10 ఆర్‌బీకేలకు వాటిని అందించామన్నారు. వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు విస్తీర్ణం బట్టి కందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు.

పొలాలకు దారి కల్పించండి సారూ..

● తహసీల్దార్‌కు రైతుల విన్నపం


సమస్య తెలిపేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు

నంబులపూలకుంట, జూన్ 24: తాము పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించాలని మండలంలోని తాటిమానుగుంత గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ నరేంద్రకుమార్‌ను కోరారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం రైతులు వచ్చి తహసీల్దార్‌కు సమస్యను వివరించారు. తమ పొలాలకు వెళ్లేందుకు దారి ఉండేదని, దానిగుండా వెళితేనే తమ పొలాలకు చేరుకుంటామని, ఇటీవల తమ గ్రామానికే చెందిన ఓ వ్యక్తి ఆ భూమిని కొనుగోలు చేసి, పొలాలకు వెళ్లే దారిని మూసివేశాడని తెలిపారు. దారికి అడ్డంగా బండలు నాటాడన్నారు. ఈదారి తన భూమిలో ఉందని, కనుక ఎవరినీ వెళ్లనివ్వనంటూ దారిని మూసివేసినట్లు ఆయన చెబుతున్నాడని రైతులు లక్ష్మయ్య, ఆంజనేయులు, పెద్దాంజనేయులు, చిన్న నరసయ్య, పెద్ద నరసయ్య, వీర నారాయణ, నరసమ్మ, ఉత్తమ్మ తదితరులు ఆవేదన చెందారు. అసలే ఏరువాక ప్రారంభమైందని, పంటలు సాగు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పుడు దారి లేకపోతే తాము పొలాలకు ఎలా వెళ్లేదని వాపోయారు. దారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ.. ఇప్పటికే సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించామని, మరోసారి వెళ్లి పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇష్టారాజ్యంగా విధులకు..

● సచివాలయ కార్యదర్శి బాధ్యతారాహిత్యం

● విసిగిపోతున్న ప్రజలు, తోటి సిబ్బంది

నల్లచెరువు, జూన్ 24: మండలకేంద్రంలోని సచివాలయం-2లో కార్యదర్శిగా పనిచేస్తున్న అధికారి బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహిస్తున్నారని, కార్యాలయానికి తనకు ఇష్టమున్నప్పుడు రావడం, వెనువెంటనే వెళ్లడం చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇతను కదిరి పట్టణంలో ఫిజియోథెరపీ ప్రాక్టీస్ పెట్టారని, ఎక్కువగా అక్కడే ఉంటూ కార్యాలయానికి సరిగా రావడం లేదని చెబుతున్నారు. ఎప్పుడో ఒకసారి వచ్చినా.. విధులు నిర్వహించకుండా ఫిజియో థెరపీ గురించి ప్రచారం చేసుకుంటూ ఉంటారని అంటున్నారు. ఈ కార్యదర్శి అవలంబిస్తున్న తీరుకు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు విసిగి పోతున్నారు. ప్రభుత్వ పనికంటే, ఆయన ఫిజియోథెరపీ గురించి చెప్పడం అధికంగా ఉందని కార్యాలయ సిబ్బంది సైతం చర్చించుకోవడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ తమ స్వార్థం కోసం పనిచేయడం ఎంతవరకు సమంజసమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కార్యదర్శిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

నల్లచెరువు, జూన్ 24: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆలయ ఈఓ రవీంద్రరాజు, అర్చకులు సోమవారం ఎమ్మెల్యేను కదిరి పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రసిద్ధిగాంచిన పాలపాటిదిన్నె ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం వసతులు కల్పిస్తామని తెలిపారు.

నేను బడికి పోతా.. ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నంబులపూలకుంట, జూన్ 24: మండలంలోని ధనియార్‌చెరువు గ్రామంలో సోమవారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నేను బడిపోతా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. పురవీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. బస్టాండ్ ప్రాంతంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఇందులో ఎంఈఓ గోపాల్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. మధ్యలో బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, బూట్లతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బోగాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, జూన్ 24: పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయక దేవాలయం 12వ వార్షికోత్సవాలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటలకు అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం 8 గంటలకు 108 కలశాల స్థాపన, 9 గంటలకు హోమాలు, అనంతరం పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మంత్రి కొల్లును కలిసిన పాండురంగప్ప



మంత్రి కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న వీఎం పాండురంగప్ప

రొళ్ల, జూన్ 24: రాష్ట్ర గనుల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్రను విజయవాడలో రాష్ట్ర సచివాలయంలో సోమవారం టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి అధ్యక్షుడు వీఎం పాండురంగప్ప శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా కమ్మరి కన్వీనర్ పోతులయ్య, కురుబ కన్వీనర్ వెంకటరమణ మంత్రిని కలిసి సత్కరించారు. అలాగే వారు ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్‌ను సైతం సచివాలయంలో కలిసినట్లు తెలిపారు. మడకశిర నియోజకవర్గాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సందర్భంగా విన్నవించామన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో చేరండి

రొళ్ల, జూన్ 24: మండలంలోని దొమ్మరహట్టి సమీపంలో ఉన్న బీఆర్‌అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశం కోసం పరీక్ష రాసి సీట్లు సాధించిన విద్యార్థులు మంగళవారం సాయంత్రంలోగా చేరాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ మైలారప్ప సోమవారం తెలిపారు. ఒకవేళ విద్యార్థులు చేరకపోతే మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

వదిన.. మరిది ఆత్మహత్య

చాగల్లు రిజర్వాయర్‌లో మృతదేహాలు

తాడిపత్రి టౌన్, జూన్ 24 : వివాహేతర సంబంధం కారణంగా వరుసకు వదిన, మరిది అయ్యే ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్‌లో వారి మృతదేహాలు సోమవారం బయటపడ్డాయి. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఓ యువకుడు(26) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వరుసకు వదిన(35) అయ్యే మహిళ గుత్తి మండలంలోని ఓ గ్రామంలో ఉంటోంది. ఆమె భర్త ఆటో డ్రైవర్. దగ్గరి బంధువులు కావడంతో ఒకరి ఇంటికి మరొకరు తరచూ వచ్చివెళ్లేవారు. ఈ క్రమంలో వదిన, మరిది దగ్గరయ్యారు. ఈ విషయం రెండు కుటుంబాల వారికి తెలియడంతో మందలించారు. దీంతో కొన్నాళ్లు దూరంగా ఉన్నారు. నాలుగు రోజుల క్రితం ఆమె తాడిపత్రికి వచ్చింది. మరిదితో కలిసి ఎటో వెళ్లిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందోగాని.. పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆపి ఇద్దరూ రిజర్వాయర్‌లోకి దూకారు. రిజర్వాయర్ వద్ద ఎవరో బైక్‌ను వదిలి వెళ్లారని పెద్దపప్పూరు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. బైక్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులకు.. ఇద్దరు కనిపించడం లేదని తెలిసి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రిజర్వాయర్‌లో సోమవారం మధ్యాహ్నం మహిళ మృతదేహం, సాయంత్రం ఆమె మరిది మృతదేహం తేలాయి. ఫొటోల ఆధారంగా పెద్ద పప్పూరు పోలీసులు మృతదేహాలను గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. ఆ మహిళకు కుమారుడు, కూతురు ఉన్నారు. యువకుడు అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా



బోల్తా పడిన దాణా లారీ

మడకశిర రూరల్, జూన్ 24: మండలంలోని కదిరేపల్లి క్రాస్‌లో సోమవారం సాయంత్రం దాణా లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రజలు అంటున్నారు. కొందరు కర్ణాటక నుంచి పశువుల దాణాను విక్రయించడానికి లారీలో తీసుకొచ్చారు. కదిరేపల్లి క్రాస్‌లో రోడ్డు పక్క ఉన్న గదిలో నిల్వ చేయడానికి లారీ రివర్స్‌లో వెళుతుండగా డ్రైనేజీ పై వేసిన బండ విరిగిపోయింది. దీంతో లారీ డ్రైనేజీలోకి ఇరుక్కుపోయి బోల్తా పడింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేదని అక్కడున్న వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, జూన్ 24: మండలంలోని అమ్మవారిపల్లిలో రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన రామాంజి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు కియ ఎస్‌ఐ రంగడు తెలిపారు. నీకేపల్లి మండలానికి చెందిన వినయ్‌కుమార్, రామాంజనేయులు కలిసి ఈనెల 21న ద్విచక్రవాహనంలో చెన్నేకొత్తపల్లి నుంచి పెనుకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అమ్మవారిపల్లి కియా పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న స్పీడ్‌బ్రేకర్ల వద్దకు రాగానే ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనుకవైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌కుమార్‌కు స్వల్పగాయాలు కాగా రామాంజినేయుల పరిస్థితి విషమంగా మారింది. అతడికి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెనుకొండ టౌన్, జూన్ 24: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. పెనుకొండ మండల పరిధిలోని గోనిపేట, శెట్టిపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పదిరోజులుగా విచ్చలవి డిగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం తనిఖీలు నిర్వహించామన్నారు. మరువపల్లి, గోనిపేటకు చెందిన రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని అనుమతులు లేవని తెలియడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముందస్తుగా వేరుశనగ సాగు

- కళకళలాడుతున్న పంట
- కలుపుతీసే పనిలో రైతులు



కళకళలాడుతున్న వేరుశనగ పంటలో కలుపు తీస్తున్న కూలీలు

మడకశిర, జూన్ 24 : ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో నియోజకవర్గంలో కొంత మంది రైతులు ముందస్తుగా వేరుశనగ సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడుతుండడంతో పంటలు కళకళలాడుతున్నా యి. ప్రతి యేటా ఖరీఫ్ సిజన్ జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఉంటుంది. ఈ యేడు వర్షాలు ముందుగానే కొందరు రైతులు ముందస్తుగానే పంటలు సాగు చేశారు. మొక్కలు కొద్దిమేర పెరిగాయి. ముందస్తుగా సాగు చేసిన రైతులు ప్రస్తు తం పంటలో కలుపులు తీస్తున్నారు. మిగిలిన రైతులు ఇప్పుడు వేరుశనగ విత్తనం వేసే పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. గత సంవత్సరం వర్షాభావం వల్ల చాల మంది రైతులు పంటలు సాగు చేయక పొలాలను బీళ్లుగా వదిలేశారు. కొందరు వేరుశనగ సాగు చేసినా వర్షాలు కురవక పంట దెబ్బతిని నష్ట పోయారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా పడుతుండడంతో ఈ యేడన్నా పంటలు పండి తాము కష్టాల నుంచి గట్టెక్కుతామన్న గంపెడాశతో రైతులు అప్పులు చేసి వేరుశనగ సాగు చేస్తున్నారు. నియోజకర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 28 వేల హెక్టార్లు. ఈ వారం రోజుల్లోనే దాదాపు మూడు వేల హెక్టార్లకు పైగా వేరుశనగ పంటను సాగు చేశారు. మిగిలిన రైతులు సాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ యేడు నియోజక వర్గంలో పూర్తి స్థాయిలో వేరుశనగ సాగవుతుందని అధికారులు అంటున్నారు. అయితే ప్రతి యేటా సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకాన్ని మల్బరీ పంటకు మాదిరి వేరుశనగ తదితర ప్రధాన పంటల సాగుకు వర్తింప జేయాలని కోరుతున్నారు.

దిగుబడులు బాగా వస్తాయి

గత యేడు వర్షాలు సకాలంలో కురవక పోవడంతో సాగు చేసిన వేరుశనగ పంట దెబ్బతిని నష్టపోయాం. ఈ యేడు ముందస్తు వర్షాలు కురవడంతో విత్తనం వేశాం. ఈ యేడన్నా వర్షాలు బాగా కురిసి పంటలు పండితే మేము కష్టాల నుంచి గట్టెక్కుతాం. ఈ ఆశతోనే వేరుశనగ సాగు చేశాం. విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికి 20 రోజులు కావస్తోంది. పంటలో కలుపు తొలిగిస్తున్నాం. ఇలాగే సకాలంలో వర్షాలు పడితే మంచి దిగుబడులు వస్తాయి.

- గోపాల్, రైతు మడకశిర

రియల్ వ్యాపారుల అసోసియేషన్

హిందూపురం అధ్యక్షుడిగా రియాజుల్లా



రియాజుల్లాను అభినందిస్తున్న టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, జూన్ 24: రియల్ ఎస్టేట్ వ్యాపారుల హిందూపురం అసోసియేషన్ అధ్యక్షుడిగా మహ్మద్ రియాజుల్లా (రజాక్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో సోమవారం సమావేశమైన రియల్ వ్యాపారులు రియాజుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకుని, అనంతరం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసంలో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదేళ్లుగా రియల్ వ్యాపారం కుదేలైందని, టీడీపీ అధికారంలోకి రావడంతో భూముల వ్యాపారం పుంజుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, సర్పంచ్ మంజునాథ్, డైమండ్‌బాబా, నూరుల్లా, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి: ఏఓ

అగళి, జూన్ 24 : మండలంలోని వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి, పంటల సాగుపై తగిన సలహాలు, సూచనలు అందజేస్తూ అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఆయన సోమవారం ఆర్బీకే సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు 2329క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. రైతులు కూడా వేరుశనగ సాగుపై మక్కువ చూపుతున్నారన్నారు. అలాగే ఆర్బీకేలలో నాలుగుకిలోల కందిబ్యాగు రూ.392ని, రైతులు వాటిని తీసుకెళ్లే విధంగా చూడాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందు బాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

'విద్యతోనే గ్రామాల అభివృద్ధి'

రొళ్ల, జూన్ 24: విద్యకు ప్రాధాన్యం ఇస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ పేర్కొన్నారు. రొళ్ల మండలం కాకి గ్రామాన్ని సోమవారం బహుజన చైతన్య వేదిక సభ్యులు సందర్శించారు. గ్రామ ప్రజలకు ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. వెనకబడిన గ్రామాల్లో ప్రజలను చైతన్య పరిచి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చల్లపల్లి ఈశ్వర్, కోఆర్డినేటర్ ఎల్లోటి హనుమంతు, పెనుకొండ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

పావగడ, జూన్ 24 : కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాచరాజనహళ్లి సమీపంలో మూడు రోజుల క్రితం జరిగిన మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క హత్యకేసులో నలుగురు నిందితులను పోలీసులు సో మవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిం దితులైన మృతురాలు చంద్రక్క కొడుకు, కోడలు, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చంద్రక్క వద్ద ఉన్న డబ్బు, నగల కోసమే వివాదం తలెత్తి ఈ హత్య జరిగినట్లు పోలీసు విచారణలో తేలినట్లు సమాచారం. ఈ హత్యకు సంబంధించి మరిన్ని వివరాలు విచారణలో తేలనుందని పోలీసులు తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీసీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రిన్సిపాల్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఏపీఆర్‌సెట్ అర్హత సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బ్రాంచ్(కోర్సు)ల వారీగా నిష్ణాతులను ప్యానెల్స్‌గా ఏర్పాటుచేసి అభ్యర్థులను ముఖాముఖీ ఇంటర్వ్యూ నిర్వహించామన్నారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రొఫెసర్లు సుదర్శన రావు, భానుమూర్తి, శోభబింధు, అరుణకాంతి, చెన్నారెడ్డి, వసుంధర, శివకుమార్, బాలనరసయ్య, దిలీప్‌కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



పోతులయ్య(ఫైల్)

ధర్మవరం,జూన్ 24: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన పోతులయ్య(28) ధర్మవరం పట్టణం నుంచి బైక్‌లో గొట్లూరు గ్రామానికి వెళ్తుండగా.. మార్కెట్ యార్డు వద్ద వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో పోతలయ్యకు తీవ్రగాయాలైన సంఘటన తెలిసిందే. చికిత్సకోసం అనంతపురం ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో బెంగళూర్‌కు తీసుకెళ్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య జ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డీఎస్సీ కోచింగ్‌కు పేర్లివ్వండి: ఎమ్మెల్యే రాజు

మడకశిరటౌన్, జూన్ 24: డీఎడ్ పూర్తి చేసి డీ ఎస్సీకి సిద్ధమవుతున్న నియోజకవర్గంలోని అభ్యర్థులు ఉచిత కోచింగ్ కోసం బుధవారం లోగా పేర్లు నమోదు చేసుకో వాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం ఒక ప్రకటన లో కోరారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న ఎస్‌జీటీ అభ్యర్థులు తమ పేర్లను వెంటనే నమోదు చేసుకుంటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపా రు. అనుభవజ్ఞులైన వారితో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేస్తా మన్నారు. వివరాలకు 9573127079, 8500236832, 8328074070 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి : గుండుమల



సమావేశంలో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూన్ 24: స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటి సారిగా బుధవారం మడకశిరకు వస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నామని, విజయ వంతం చేయాలని కోరారు. ఆయన సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమై విజయోత్సవ ర్యాలీపై చర్చించారు. ప్రచారానికి తక్కువ సమ యం ఉన్నా అందరం కలసికట్టుగా ఎంఎస్ రాజును గెలిపించుకున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఓబుళేశు, భక్తర్, రాజు, పట్టణ అధ్యక్షుడు మనోహర్, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి/రొళ్ల: మడకశిరలో బుధవారం నిర్వహించే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, టీడీపీ అగళి మండల కన్వీనర్ కుమారస్వామి, రొళ్ల మండల కన్వీనర్ దాసిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10గంటలకు మడకశిర వాల్మీకి సర్కిల్ నుంచి బయలుదేరనున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అడిగేవారెవరని..!

- కొర్రపాడు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరాచకాలు
- సిబ్బందితో వెట్టిచాకిరీ... పిల్లలపై వేధింపులు
- నిత్యావసర సరుకుల పక్కదారి
- సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్



సిబ్బందితో మసాజ్ చేయించుకుంటున్న ప్రిన్సిపాల్



మూట కట్టి తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన సరుకులు

బుక్కరాయసముద్రం, జూన్ 24: ప్రభుత్వం మారినా మండలంలోని కొర్రపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తీరు మారలేదు. గతంలో వైసీపీ నాయకుల అండతో ఆమె అరాచకాలకు హద్దే లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులనే ఆమె గడగడలాడిం చింది. ఆమె పనిచేస్తున్న గురుకుల పాఠశాలలో తనిఖీకి ఉన్నతస్థాయి అధికారులు రావాలంటేనే జంకేవారు. విద్యార్థులకు సం బంధించిన నిత్యావసర వస్తువులను బహిర్గతంగా ఇంటికి తరలించేది. గతంలో విద్యా ర్థులకు వచ్చిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా జిల్లా డీసీఓ బాలాజీ నాయక్ పట్టుకుని ఆమెను సస్పెండ్ చేశారు. అనంతరం ఆమె అధికార పార్టీ నేతల సహకా రంతో తిరిగి గురుకుల పాఠశాలకు వచ్చింది. అవినీతి ఆరోపణలున్నా... ఆమెపై విచారణ చేయడానికి సంబంధించిన జిల్లా కో-ఆర్డినేటర్ ముందుకు వచ్చేవారు కాదు. విద్యార్థులకూ సరైన భోజనం పెట్టేవారు కాదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలను వేధించేది. సిబ్బందితో వ్యక్తిగత పనులన్నీ చేయించుకునేది. వారితో ఇంటి వద్ద పనులు కూడా చేయించేది. సిబ్బందితో ఆమె ప్రతి రోజూ మసాజ్ చేయించుకోవడం.. జడ వేయించుకోవడం.. తదితర పనులన్నీ చేయించుకునేది. ఎవరికి ఫిర్యాలు చేసినా స్పందన లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తప్పనిపరిస్థితుల్లో ఆమె చెప్పినట్లు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వారినా ఆమె తీరు మారలేదు. దీంతో బాధితులు ఆమె అరాచకాలను చిత్రీకరిస్తూ తీసిన ఫొటోలు, వీడియోలను ఇటీవల సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆమె అరాచకాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతికి పాల్పడలేదు : ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గురుకుల బాలికల పాఠశాలలో నేను ఎలాంటి అవినీతి పాల్పడలేదు. కొంత మంది గిట్టని వ్యక్తులు నాపై ఇలా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ, విద్యార్థుల కమిటీ సభ్యులుంటారు. ప్రతి ఒక్కటి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. అవినీతికి పాల్పడే అవకాశమే లేదు. సిబ్బందితో వెట్టిచాకరి, మసాజ్ చేయించుకోలేదు. సెలవుల సమయంలో ఇంటి వద్దకు సిబ్బంది వస్తే... ఆ సమయంలో ఏదో తల మీద పడితే.. సిబ్బంది చూశారే తప్పా.. ఎలాంటి పనులూ చేయించుకోలేదు.

ఇటుకల బట్టీ పొగతో ఇబ్బందులు



లేపాక్షి, జూన్ 24: స్థానిక లేపాక్షి-హిందూపురం జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన ఇటుకల బట్టీవద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు. లేపాక్షి-హిందూపురం జాతీయ రహదారిలో గలిబిపల్లి క్రాస్ వద్ద సమీపంలో ఇటుకల బట్టీ ఏర్పాటు చేశారు. దాని నుంచి వెలువడే పొగ వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అంతేకాక ఈ పొగవల్ల పంటలు సరిగా పండక నష్టపోతున్నామని గలిబిపల్లి, బిసలమానే పల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గింజపట్టే సమయంలో ఈ పొగవల్ల దిగుబడి చాలా తగ్గిపోతోందని వారు అంటున్నారు. ప్రధాన రహదారి పక్కన అనుమతులు ఎలా ఇచ్చారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటుకల బట్టీ నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించాలని వారు కోరుతున్నారు.

ఇటుకల బట్టీ నుంచి వస్తున్న పొగతో వాహనదారుల ఇబ్బందులు

కాజేసిన సొమ్మును ఇప్పించండి

మున్సిపల్ కార్యాలయం వద్ద మహిళాసంఘాల ఆందోళన



మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

హిందూపురం, జూన్ 24 : పట్టణంలోని విద్యానగర్ ప్రాంతంలో ఉన్న వివేకానంద మహిళా సమాఖ్యలో కొంతకాలం కిందట ఆర్పీగా పనిచేసిన అలివేలమ్మ రుణాలు తీసుకుని కట్టలేదంటూ మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చేశారు. సమాఖ్యంలోని 32సంఘాలకు చెందిన సభ్యులు సోమవారం మునిసిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్పీగా పనిచేసిన అలివేలమ్మ బుక్‌కీపర్‌గా పనిచేస్తూ సమాఖ్య లావాదేవీలు చూసేదన్నారు. ఆమె 2021నుంచి సమాఖ్యకు సంబంధించిన పుస్తకాల్లో లావాదేవీలు రాయలేదని, ఆడిటింగ్ చేయలేదన్నారు. దీనిపై నిలదీస్తే సమాధానం చెప్పకుండా దాటవేస్తోందన్నారు. మూడేళ్లపాటు జరిగిన సమాఖ్య లావాదేవీలపై ఇటీవల వేరే వారితో ఆడిటింగ్ చేస్తే రూ.13.70లక్షలను బ్యాంక్‌లో జమ చేయలేదని తేలిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయోధ్య రామయ్య దర్శనానికి ప్రత్యేక బస్సు



బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

హిందూపురం అర్బన్, జూన్ 24: అయోధ్య బాలరాముని దర్శనానికి ఆర్టీసీ హిందూపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులో భక్తులు సోమవారం తరలి వెళ్లారు. జిల్లా డీపీడీఓ మధుసూదన్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఎనిమిది రోజుల యాత్రలో 14 పుణ్యక్షేత్రాల దర్శనం కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. టికెట్ ధర రూ. 8500 అన్నారు. పుణ్యక్షేత్రాల దర్శనం కల్పించడంలో ఆర్టీసీ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక డిపో మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, మెకానికల్ ఇంజనీర్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌బీ మార్పుపై తహసీల్దార్‌తో వాగ్వాదం

గోరంట్ల, జూన్ 24: మండలంలోని గౌనివారిపల్లి కాంగారెడ్డిపల్లికి చెందిన సర్వేనెంబర్ 109-4లోని రెండున్నర ఎకరాలకు సంబంధించి వన్‌బీ మార్పడంపై బాధితులు తహసీల్దార్ అక్బల్ బాషాతో సోమవారం వాగ్వాదానికి దిగారు. పైసర్వేనెంబర్‌లోని రెండున్నర ఎకరాల పొలాన్ని అన్నదమ్ము లైన నంజుడప్ప, రామప్ప 1973లో కొనుగోలు చేశారు. వారిరువురు చెరిస గం సాగు చేసుకుంటురు. వాటికి పట్టాదారు పాస్‌పుస్తకాలు రాలేదు. అయి తే ఆ అసైన్డు భూమి మొత్తానికి రామప్ప భార్య వెంకటమ్మ పేరుతో 2024 మార్చి 28న రెవెన్యూ అధికారులు వన్‌బీ మార్పు చేశారు. విషయం తెలుసు కున్న నంజుడప్ప కుమారుడు తిరుపాల్, శ్రీరాములు, మల్లికార్జున తదితరులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌తో చర్చించారు. తాను రాకమునుపు ఉన్న తహసీల్దార్ రంగనాయకులు మ్యూటేషన్‌కు ఆదేశించడంతో తాను వన్‌బీ మార్పు చేసినట్లు తహసీల్దార్ సమాధానమిచ్చారు. దీంతో న్యాయం కోసం పోరాడుతామని వారు వెళ్లిపోయారు.

పాడి రైతులను ఆదుకోవాలి: ఏఐకేకేఎంఎస్

హిందూపురం అర్బన్, జూన్ 24: పాడి రైతులను పూర్తిగా ప్రభు త్వమే ఆదుకోవాలని అఖిల భారత రైతు వ్యవసాయ కూలీ సంఘం (ఏఐకేకేఎంఎస్) నాయకులు సోమవారం పరిగి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహం, వ్యవసాయ అధికారి విజయభారతికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిగి మండల కేంద్ర వ్యాప్తంగా పాడి రైతులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ప్రతి రోజు వందల లీటర్ల పాలు విక్రయించి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇటీవల పాలు అధికంగా వస్తున్నాయని, మార్కెట్ లేదని ప్రైవేట్ డైరీల వాళ్లు పాలను తీసుకోవడం లేదని ఆవేదన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వట్టి మాటలు చెప్పి మోసం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా లీటరు పాలకు అదనంగా రూ.4 పెంచి రైతుల వద్ద నుంచి పాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏఐకెకెఎంఎస్ నాయకులు సంజీవ రాయప్ప, శంకరప్ప, వివిధ డెయిరీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

ఫొటోలు తీస్తున్న విలేకరులపై దాడి



రాత్రిపూట ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

పావగడ, జూన్ 24 : తాలూకా పరిధిలోని పులిబెట్టు తండా సమీపం నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుకను అక్రమ రవాణాపై ఫొటోలు తీసేందుకు ఆదివారం రాత్రి వెళ్లిన విలేకరులపై దాడిచేసి వారి మొబైల్‌లను లాక్కు న్నారు. తాలూకా పరిధిలోని శ్రీరంగపురం ఎన్‌ఎంతండాకు చెందిన శివశంకర్ నాయక్, యాదికుంట గ్రామానికి చెందిన రామాంజనేయ కలిసి నాగుల మడక ఉత్తర పినాకిని నది నుంచి ఇసుకను తరలించేందుకు నాలుగు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. వారు రోజూ రాత్రి పూట పావగడ, వివిధ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రొప్పం గ్రామస్థులు వాపోతున్నారు. ట్రాక్టర్లకు నంబర్‌ప్లేట్లు తీసేసి, ఎలాంటి అనుమతులు లేకుండానే భారీగా ఇసుకు తరలిస్తున్నారన్నారు. అక్రమంగి ఇసుక తరలించే ట్రాక్టర్లు రొప్పం గ్రామంలో నంచి ఇళ్ల మధ్యలో కూడా అతివేగంగా వెళుతుండడంతో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయని తెలిపారు. దీనిపై పోలీసులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తిరుమణి, పావగడ పోలీసులు వారి నుంచి ముడుపులు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండి పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇసుక అక్రమరవాణాపై ఫొటోలు తీసేందుకు వెళ్లిన విలేకరులపై అక్రమార్కులు దాడులు చేశారని వాపోయారు. విలేకరులపై దాడిని ఖండిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదన్నారు. ఆంధ్రా పోలీసులు కూడా ముడుపులు తీసుకుంటూ రొద్దం సరిహద్దులోని నారనాగేపల్లి, గౌరాజుపల్లి మీదుగా ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.